నమస్తే తెలంగాణ





రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న మహిళా రైతు



బోధన్-హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించిన కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ రైతులను సముదాయిస్తున్న బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ

# గుండె మండిన రైతు..

- వడ్లు కొనడం లేదని రైతుల ఆందోళన
- కాంటా వేయకపోవడంపై ఆగ్రహం
- అకాల వర్షాలకు మొలకెత్తిన ధాన్యం
- తడిసిన ధాన్యం కొనాలని డిమాండ్
- రాస్తారోకోతో భారీగా ట్రాఫిక్ జామ్
- సీఎం డౌన్ డౌన్ అని రైతుల నినాదాలు



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సూరేపల్లి గ్రామ రైతులు

చిలిపిచెడ్/కోనరావుపేట/నిజాంసాగర్/భువనగిరి కలెక్టరేట్/బీబీనగర్, మే 15 : వరి ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తున్నారని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా రైతులు రోడ్డెక్కారు. వద్దురా నాయన కాంగ్రెస్ పాలన..సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ రైతులు నినాదాలు చేశారు. కేంద్రాల్లో ధాన్యం పోసి నెల రోజులు కావొస్తున్నా కొనుగోలు ప్రక్రియ సాగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంటా అయిన ధాన్యం కూడా మిల్లులకు తరలించకపోవడంతో అకాల వర్షానికి తడిసి ముద్దైంది. ధాన్యపు గింజలన్నీ మొలకెత్తాయి. అన్నదాతను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవట్లేదు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మిల్లర్లు కలిసి రైతులను శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో సుమారు 2 గంటల పాటు రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు వారం రోజులు గడుస్తున్నా లారీల కొరత కారణంగా ధాన్యం కేంద్రాల్లోనే నిల్వ ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చిట్కుల్‌లో తూకం వేసిన ధాన్యం తరలించడం లేదని అధికారుల తీరును నిరసిస్తూ రైతులు ఆందోళన చేశారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించడంలో తీవ్రం జాప్యం చేయడంతో పాటు ధాన్యం బస్తాకు మూడు కిలోల తరుగు తీయడాన్ని నిరసిస్తూ బుధవారం మెదక్-సంగారెడ్డి రహదారిపై రైతులు రాస్తారోకోకు దిగారు. సోమక్కపేట పీఏసీఎస్ సిబ్బంది నర్సింహులు అక్కడికి చేరుకొని సివిల్ సప్లై్ల డీఎంతో ఫోన్‌లో మాట్లాడి రైతులను సముదాయించారు. డీఎం హామీ మేరకు రైతులు రాస్తారోకోను విరమించారు. ఐదారు రోజులుగా కాంటాలు చేయడం లేదని కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ రైతులు బోధన్-హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించారు. రెండు గంటల పాటు సాగిన రైతుల ధర్నాతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ కొమలంచకు వచ్చి అన్నదాతలతో చర్చలు జరిపారు. తహసీల్దార్ క్రాంతికుమార్ హామీ ఇవ్వడంతో కర్షకులు శాంతించారు.

### తడిసిన ధాన్యం కొనాలని...

అకాల వర్షానికి మొలకెత్తిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని సూరేపల్లి, పచ్చర్లబోడుతండా గ్రామస్థులు బుధవారం వేర్వేరుగా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న సివిల్ సప్లయ్ మేనేజర్ గోపీకృష్ణ రైతుల ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అలాగే బీబీనగర్ మండలం గూడూరులోనూ రైతులు ధాన్యాన్ని రోడ్డుపై పోసి నిప్పంటించి ధర్నా చేపట్టారు. ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాంతో 40 నిమిషాలు రోడ్డుపై కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన చేపట్టిన రైతుల వద్దకు పోలీసులు, అధికారులు వచ్చి సర్ది చెప్పారు.

### వెంటనే వడ్లు కొనాలె



నెల కిందనే పొలం కోసి వెంటనే సెంటర్‌లో వడ్లు పోసిన. ఇప్పటివరకు కొనలె. మొన్నటి దాకా ఎలక్షన్ అన్నరు. ఇప్పడేమో వడ్లు కొనలేక, తేమ శాతం వస్తేనే వడ్లు కొంటాం అని బెదిరిస్తున్నరు. వడ్లు వెంటనే కొనుగోలు చేయాలి.

– తిరుపతి, మల్కపేట, రాజన్నసిరిసిల్ల జిల్లా

### లారీలు లేవంటున్నరు



మల్కపేటలో తూకం వేసిన బస్తాలు మిల్లులకు తరలించకుండా లారీలు లేవంటున్నరు. ధాన్యం అమ్మేందుకు ఇ బ్బందులు పడుతున్నం. వెంటనే మా సమస్య పరిష్కరించాలి.

–అద్దాల మల్లేశం, మల్కపేట, రాజన్నసిరిసిల్ల జిల్లా

### తడిసిన ధాన్యం కొనాలి



ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి. కాంటా వేసిన 350 బస్తాల ధాన్యం వానలో తడిసి ముద్దయితున్నది. ధాన్యం కాంటా వేసి ఎనిమిది రోజులు దాటినా ఇంకా మిల్లులకు తరలించకుండా కొనుగోలు కేంద్రంలోనే ఉంచిండ్రు. కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి.

– గడ్డం విజయ, రైతు, గూడూరు, యాదాద్రి భువనగిరి జిల్లా

### సగం కుప్పలు అయిపోలే



ధాన్యం కొనుగోలు కేంద్రంలో పోసి నెల అవుతుంది. ఇంకా సగం మంది కుప్పలు కూడా అయిపోలేదు. కాంటా వేసిన ధాన్యాన్ని కూడా పది రోజులుగా ఆపుతున్నరు. వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

– నోముల భిక్షపతి, గూడూరు, యాదాద్రి భువనగిరి జిల్లా

### ఉసురు తగులుతుంది



రైతులను ఇబ్బందికి గురి చేసే వారికి ఉసురు తప్పక తగులుతుంది. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రైతులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. 20 రోజులుగా ధాన్యంరాశులు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. ధాన్యం తడిసి మొలకలొచ్చాయి. వెంటనే ధాన్యం కొనుగోలు చేయకుంటే తిరిగి ఆందోళన చేపడుతాం.

– ఆంజనేయులుగౌడ్, సూరేపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా



యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు



యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరులో ధాన్యం రోడ్డుపై పోసి నిప్పంటిస్తున్న రైతులు

# నేడు రాష్ట్రవ్యాప్త నిరసన

మొదటిపేజీ తరువాయి...

కొనాలంటూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు నిరసనలకు దిగారు. ఈ నేపథ్యంలో రైతులను గోసపుచ్చుకుంటున్న సర్కారుకు వ్యతిరేకంగా నిరసనలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. గురువారం అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటూ గులాబీ సైనికులకు పిలుపునిస్తూ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతుల పక్షాన నిలబడాలని బీఆర్ఎస్ శ్రేణులను కోరారు. రైతాంగానికి భరోసా కల్పించే దిశగా నిరసన కార్యక్రమాలతోపాటు ప్రతిరోజూ వడ్ల కల్లాల వద్దకు వెళ్లి రైతులకు అండగా నిలవాలని సూచించారు. రైతుల హక్కులను కాపాడేందుకు, వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేశారు.

### అవసరం తీరంగనే నాలుక మడత

లోక్‌సభ ఎన్నికలు ముగిసీ ముగియగానే బోనస్‌పై నాలుక మర్లేసిన కాంగ్రెస్‌పై కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలింగ్ ముగిసిన తెల్లారే వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు సన్నవడ్లకే బోనస్ అంటూ చేసిన ప్రకటనపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నట్టు చెప్పారు. మాటమార్చిన సర్కారుపై పిడికిలెత్తారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన మర్నాడే వరికి క్వింటాలకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామంటూ రైతాంగాన్ని వంచించారని, మోసం చేశారని, దగాచేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 90 శాతం మంది రైతులు దొడ్డు రకం వడ్లనే పండిస్తారని, ఈ విషయం తెలిసి కూడా సన్నవడ్లకే బోనస్ ఇస్తామని ఎట్లా ప్రకటిస్తారని నిలదీశారు. 'ఓట్లు డబ్బాలో పడంగనే కాంగ్రెస్‌కు రైతుల అవసరం తీరింది. అందుకే నాలిక మర్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పూనుకున్నది. సన్నవడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు చెప్పి ఉంటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కుతుక్కు చేసేవాళ్లు. ప్రజలు ఇప్పటికీ ఆగ్రహంతో ఉన్నారు. రైతుబంధు ఇయ్యక, రైతు భరోసా ఇయ్యకుండా రైతాంగాన్ని అన్ని రకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నది. రైతాంగ హక్కులను, హామీలను సాధించేందుకు బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపడుతున్నది' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

# సన్నవడ్లకే బోనస్?

- దొడ్డు వడ్లను ఎఫ్‌సీఐ ఎలాగూ కొంటది
- సన్నవడ్లకే బోనస్ ఇచ్చి కొంటం
- చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- దొడ్డు ధాన్యం రైతులకు సున్నమే!
- రాష్ట్రంలో ఎక్కువగా దొడ్డు వడ్లే సాగు
- నిన్నటిదాకా బోనస్ అంటూ గొప్పలు
- తీరా ఇప్పుడు సన్నాలకేనని మెలిక
- సర్కారుపై మండిపడుతున్న రైతులు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తాం..
- ఇది అసెంబ్లీ ఎన్నికల ముందు మాట

ఇప్పుడే అధికారంలోకి వచ్చినం.. ఈ యాసంగిలో బోనస్ ఇవ్వలేం..
- ఇది అధికారంలోకొచ్చిన తర్వాత మాట

వానకాలం నుంచి ధాన్యానికి బోనస్ ఇస్తాం..
- ఇది లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోని మాట

సన్న ధాన్యానికే బోనస్ ఇస్తాం
- ఇదీ.. సీఎం రేవంత్‌రెడ్డి తాజా మాట



హైదరాబాద్, మే 15(నమస్తే తెలంగాణ): 'ఇచ్చిన హామీల్లో మరోదానికి ఎగనామం పెట్టేందుకు కాంగ్రెస్ సర్కారు ప్రయత్నిస్తున్నదా? ఆ పార్టీ మాటలు నమ్మిన రైతుల ఆశలు అడియాసలే కానున్నాయా?' అంటే 'అవును' అనేదే సమాధానం! నిన్నమొన్నటిదాకా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు అంతా తూచ్ అని చెప్పకనే చెప్పింది. 'ఓట్ల ముందు ఓడ మల్లన్న.. ఓట్లయ్యాక బోడి మల్లన్న' అన్నట్లుగా రెండు ఎన్నికలు ముగిశాక ఇప్పుడు కేవలం సన్నవడ్లకే బోనస్ ఇస్తామని సూత్రప్రాయంగా ప్రకటించి దొడ్డు వడ్లు పండించే రైతులకు 'చెయ్యి'చ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మంగళవారం నిర్వహించిన చిట్‌చాట్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేసినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ 'సన్నవడ్లు పండించే రైతులకు దిగుబడి తగ్గి, ఖర్చు ఎక్కువై నష్టాలు వస్తున్నయ్. కాబట్టే రైతులెవరూ సన్నవడ్ల సాగుకు ముందుకు రావడం లేదు. అందుకే సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తే రైతులు సన్నాల సాగుకు ముందుకొస్తారు. ఆ ధాన్యాన్ని కొనుగోలు చేసి రేషన్ షాపుల్లో ప్రజలకు సన్న బియ్యం అందిస్తం' అని చెప్పారు. ఇదే సందర్భంలో 'రాష్ట్రంలో ఎక్కువ రైతులు దొడ్డు వడ్లే పండిస్తారు కదా' అని విలేకరులు ప్రశ్నించగా 'దొడ్లు వడ్లను ఎలాగూ ఎఫ్‌సీఐ కొంటుంది కదా' అని సీఎం సమాధానమిచ్చినట్టు తెలిసింది. దీంతో కాంగ్రెస్ ప్రకటించిన బోనస్ హామీ ఉత్త బోగసేనని, సన్న వడ్లకు బోనస్ ఇచ్చి దొడ్డు ధాన్యం రైతులకు ఇవ్వకుంటే వారి పొట్టకొట్టినట్టేనన్న చర్చ కొనసాగుతున్నది.

### తప్పించుకునేందుకేనా..?

కాంగ్రెస్ ఇచ్చిన బోనస్ హామీ ప్రభుత్వానికి ఆర్థికంగా భారమవుతుందన్న కారణంతోనే తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకే సన్నవడ్లు, దొడ్డు వడ్లు అంటూ కొత్త నాటకానికి తెరతీసిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఏటా వానకాలం, యాసంగి కలిపి సుమారు 1.20 కోట్ల ఎకరాల్లో వరి సాగవుతుంది. ఏటా కోటి టన్నులకు పైగా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన కోటి టన్నులకు బోనస్ ఇవ్వాల్సి వస్తే ఏటా సుమారు రూ. 5-7వేల కోట్ల దాకా ప్రభుత్వంపై భారం పడే అవకాశముంది. కేవలం సన్నాలకే బోనస్ ఇవ్వాల్సి వస్తే మిల్లర్లు, వ్యాపారుల కొనుగోళ్లు, రైతుల అవసరాలు పోను కేవలం 10-20 లక్షల టన్నులకన్నా ఎక్కువ కొనే పరిస్థితి ఉండదు. ఇలా అయితే కేవలం రూ. వెయ్యి కోట్లతో కథ ముగిసిపోతుంది. అందుకే ఈ మెలిక పెడుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

### దొడ్డు వడ్ల సాగే ఎక్కువ..

రాష్ట్రంలో వానకాలమైనా, యాసంగి అయినా దొడ్డు వడ్లే ఎక్కువ సాగవుతాయి. సన్నవడ్ల సాగు తక్కువ ఉంటుంది. అదీ కొన్ని ప్రాంతాలకే పరిమితం. సాధారణంగా వానకాలంలో 30-40శాతం సన్నాలు, 60-70శాతం దొడ్డు వడ్లను రైతులు సాగు చేస్తారు. యాసంగిలో సన్నాలు కేవలం 10-15శాతం, దొడ్డు వడ్లు 90శాతం సాగవుతాయి. కేవలం ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్, వరంగల్‌లోనే సన్నవడ్లు సాగవుతుండగా, మిగిలిన జిల్లాల్లో రైతులు తమ ఇంటి అవసరాల కోసమే పండిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో సన్న వడ్లకే బోనస్ ఇస్తామంటే దొడ్డు వడ్లు పండించే రైతుల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### వడ్లు కొంటలేరని ఎమ్మెల్యేను

## నిలదీసిన రైతులు

- సమాధానం చెప్పలేక జారుకున్న ఆది శ్రీనివాస్
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

*రాజన్న సిరిసిల్ల, మే 15 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లలో సర్కారు అలసత్వంపై రైతులు మండిపడుతున్నారు. గ్రామాల్లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. లారీలను సమకూర్చడంలో అధికార యంత్రాంగం విఫలమైందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాల గ్రామానికి ఇటీవల ప్రచారం కోసం వెళ్లిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మహిళా రైతులు అడ్డుకున్నారు. తీసుకెళ్లిన ధాన్యాన్ని సెంటర్లలో తూకం వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుల తరబడి తూకం వేయకపోవడంతో కేంద్రాల్లోనే ఎండలో ఉండాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన చెందారు. పంటకు సరిగా నీళ్లివ్వని సర్కారు.. ధాన్యాన్ని కూడా కొనడం లేదంటూ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు.మహిళలు నిలదీయడంతో సమాధానం చెప్పలేక ఆయన అక్కడి నుంచి జారుకున్నారు. 4 రోజుల క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో బుధవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.*



నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మద్దిపడగలో వర్షానికి తడిసిన ధాన్యం

# అకాల వర్షానికి తడిసిన ధాన్యం

## ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో గాలివాన బీభత్సం

ఆదిలాబాద్/నిర్మల్, మే 15: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిముద్దయింది. కడెం మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వడ్లు, ముథోల్ మండలంలో సజ్జ, మక్కజొన్న ఉత్పత్తులు తడిసి ముద్దయ్యాయి. దిలావర్‌పూర్ మండలంలోని నిర్మల్-భైంసా 61వ జాతీయ రహదారిపై చెట్లు నేలకొరిగాయి. తాంసి మండలంలో కోసిన నువ్వులు, జొన్న పంట తడిసింది. బోథ్ మార్కెట్ యార్డుకు జొన్నలు అమ్మకానికి తెచ్చిన రైతులు వర్షంతో తంటాలు పడ్డారు. తూకం వేసి సంచుల్లో నింపిన, కుప్పలుగా పోసిన జొన్నలు తడవకుండా ఉండేందుకు అష్టకష్టాలు పడి టార్పాలిన్లు కప్పారు. మామిడి కాయలు నేలరాలాయి. ఇచ్చోడ మండలం ధర్మసాగర్ వెళ్లే మార్గంలో పెద్ద వృక్షం పడిపోవడంతో 108 అంబులెన్స్ సేవలు నిలిచిపోయాయి. ఇంద్రవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో పలువురి ఇండ్ల పైకప్పులు, రేకులు ఎగిరిపడ్డాయి.

# మంత్రుల్లేకుండానే సీఎం సమీక్ష!

- ధాన్యం కొనుగోళ్లు, రైతు రుణమాఫీపై సీఎం రివ్యూ
- హాజరుకాని సంబంధిత మంత్రులు భట్టి, తుమ్మల
- క్యాబినెట్ భేటీపైనా సంప్రదించలేదని పలువురి కినుక

హైదరాబాద్, మే15 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సచివాలయంలో పలు అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశం ఇటు ప్రభుత్వ, అటు కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సంబంధిత మంత్రులు లేకుండానే వారి శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష జరపడం పట్ల కాంగ్రెస్ ముఖ్యనేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మంత్రులను సమీక్షకు పిలవలేదా? పిలిచినా రాలేదా? అని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. రాష్ట్రంలో రైతురుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల అంశంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు లేకుండానే అధికారులతో సమీక్షించిన సీఎం వారికి పలు ఆదేశాలు సైతం జారీచేశారు. గతంలో కూడా రెండు పర్యాయాలు మంత్రి తుమ్మల లేకుండానే వ్యవసాయశాఖపై సీఎం సమీక్షించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల లేకుండానే గతంలో అక్కడి పరిస్థితిపై రివ్యూ చేశారని, దుమ్ముగూడెంపై కూడా మంత్రి లేకుండానే సమీక్షించారని ఆయన అనుచరులు మండిపడుతున్నారు. తాజాగా మరోసారి తుమ్మల లేకుండానే వ్యవసాయ శాఖపై సమీక్షించడం అనేక సందేహాలకు తావిస్తున్నది. ఇదిలాఉండగా డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క లేకుండానే రైతురుణమాఫీ అంశంపై కూడా సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించడం చర్చనీయాంశంగా మారింది. రైతురుణమాఫీ చేయాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ వ్యయాల వివరాలు తదితర అంశాలపై ఆర్థికశాఖతో చర్చించాల్సి ఉంటుంది. అయితే ఆ శాఖ మంత్రి భట్టి లేకుండానే సంబంధిత అధికారులతో సీఎం రేవంత్ సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ సమీక్షలకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హాజరు కావడం గమనార్హం. దీనిపై ఇప్పుడు ప్రభుత్వ, కాంగ్రెస్ వర్గాల్లో చర్చకొనసాగుతున్నది.

### సమాచారం లేకుండానే క్యాబినెట్ !

మరోవైపు కనీస సమాచారం ఇవ్వకుండానే 18వ తేదీన క్యాబినెట్ సమావేశం ఏర్పాటుచేశారని పలువురు మంత్రులు సైతం కినుక వహించినట్టు తెలుస్తున్నది. తమను సంప్రదించకుండానే తేదీ నిర్ణయించడంపై పలువురు మంత్రులు తమ అనుచరుల ముందు మండిపడుతున్నట్టు తెలుస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల అనంతరం పలువురు మంత్రులు వ్యక్తిగతంగా వివిధ కార్యక్రమాలను నిర్ణయించుకున్నారు. కొందరు పొరుగు రాష్ట్రాలకు వెళ్లేందుకు ప్రణాళిక వేసుకోగా.. మరో కీలక మంత్రి ఇప్పటికే విదేశీ పర్యటనలో ఉన్నారు. అయితే ముందస్తుగా సంప్రదించకుండా, ఏకపక్షంగా క్యాబినెట్ భేటీ తేదీని సీఎం రేవంత్ ఖరారు చేయడాన్ని పలువురు మంత్రులు ఆక్షేపిస్తున్నట్టు తెలుస్తున్నది.



కేసముద్రం మార్కెట్‌లో వేరుశనగను ఇంటికి తీసుకెళ్తున్న రైతు సుధాకర్

# వేరుశనగను కొంటలేరని ఇంటికి వాపస్

కేసముద్రం, మే 15: వేరుశనగ పంటను అమ్ముకుందామని మార్కెట్‌కు తెస్తే వ్యాపారులు కొంటలేరని రైతులు ఆందోళన చెందుతున్నారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని పెనుగొండ గ్రామానికి చెందిన రైతులు ముదిగిరి కుమారస్వామి, సుధాకర్ 15 బస్తాల చొప్పున వేరుశనగను బుధవారం కేసముద్రం మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఉదయం ఈ-నామ్ ద్వారా వ్యాపారులు టెండర్ వేయగా వేరుశనగను ఏ వ్యాపారి కూడా ఖరీదు చేయలేదు. దీంతో రైతులు మార్కెట్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు ఫిర్యాదు చేయగా వ్యాపారులను అడగాలని సూచించారు. ఈ మేరకు రైతులు మిల్లుల వద్దకు వెళ్లి వేరుశనగను కొనాలని కోరగా, కొంతమంది నిరాకరించగా, మరికొంతమంది క్వింటాల్‌కు రూ.4 వేల చొప్పున ఖరీదు చేస్తామని చెప్పారు. సాయంత్రం వరకు చూసినా ఎవరూ కొనకపోవడంతో చేసేదేమీ లేక రైతులు ఇంటికి తీసుకెళ్లారు.